
# ప్రాణం ఖరీదు



డబ్బు జబ్బున్న కొన్ని ఆసుపత్రుల తీరుకు అద్దం పట్టిన అడపా రామకృష్ణ కథానిక.

సూర్య ప్రతాపానికి నగరం తల్లడిల్లుతోంది. గ్రీష్మతాపాన్ని తట్టుకోలేక ప్రతీ ఒక్కరూ భయభ్రాంతులవుతున్నారు. ప్రచండ భానుడి ఆగ్రహానికి తోడైన ఉక్కపోతకు తట్టుకోలేక ఏ చెట్టు నీడైనా దొరుకుతుందేమోనని పరుగులు తీస్తున్నారు. ఆ రోడ్డుమీద భూషణరావు నడవలేక, కాళ్ళీడ్చుకుంటూ చిక్కిన శరీరంతో ఓర్పుగా ముందుకు నడుస్తున్నాడు. రిటైరయిన దగ్గరన్నుండి ఒకటేకోరిక, ఆరాటం, ఆవేద. కూతురు ప్రతిమకు తొందరలో పెళ్లిచేయాలనే తపన. ఒక్కరోజు కూడా ఇంటి పట్టున ఉండటం లేదు.

దాహంతో గొంతుక తడి ఆరి, పిడచకట్టుకు పోయినట్లు అలసిపోయి, ఇంటి గుమ్మంలోకి రాగానే నరికేసిన చెట్టులా కూలబడిపోయాడు. చమటచుక్కలు ముఖం మీది నుండి దారలు దారలుగా కారుతున్నాయి. గుండె బరువెక్కింది. స్వల్పంగా లోలోన ఎక్కడో సూదులతో పొడుస్తున్నట్లు భరించలేనంత నొప్పి ప్రారంభమైంది. గుమ్మంలో

అలికిడి వినపడగానే తలుపుతెరిచింది ఇంటి ఇల్లాలు పార్వతి, భర్తను చూసి గుండె బేజారెత్తినట్లు, "అయ్యో, మీరా! ఇంత ఎండలో పనిగట్టుకుని ఎవరు తిరగమన్నారు మిమ్మల్ని? ఏమయింది అలాగయిపోతున్నారు? ముఖం తిరుగుతొందా?"అంటూ భర్తను పట్టుకొని హృదయవేదనతో, " ఒరేయ్ ప్రభాకరం, ఇలా రారా, మీ నాన్న వడదెబ్బ తిన్నట్లున్నారు చూడరా' అంటూ గగ్గోలు పెడుతున్నట్లు పిలిచింది కొడుకును.

భూషణరావు ముచ్చెమటలతో తడిసి ముద్దయిపోయి కుడిచేత్తో గుండెను అదేపనిగా రుద్దుకోసాగాడు. ప్రభాకరం మంచినీళ్ళు పట్టుకొచ్చి ఇచ్చాడు. రెండు గ్లాసులు గటగట తాగేశాడు.

" ఒరేయ్ అబ్బాయ్! గుండెల్లో నొప్పొస్తోందిరా, ఆస్పత్రికి తీసుకుపదా" అంటూ మూలుగుతుంటే, పార్వతి కళ్ళ నీళ్ళు ఒత్తుకుని ఆప్యాయంగా భర్త గుండెలమీద నిమురుతూ కొడుకువైపు చూసింది. అప్పుడే ప్రతిమ కాలేజీ నుండి వస్తూ గాబరా పడింది. " అమ్మా! డాడీకేమయింది? అలా గింజుకుంటున్నారేమిటి? నాకు భయమేస్తోందే" అంటూ కలవరపడిసాగింది.

ప్రభాకరం పరుగెత్తికెళ్ళి ఆటో తీసుకువచ్చాడు. ఆటోలో భూషణరావుని ఎక్కించి పార్వతి, ప్రతిమ పట్టుకుని కూర్చున్నారు. ప్రభాకరం ఆ వెనుకే స్కూటర్ మీద ప్రయాణమయ్యాడు.మనసంతా చెప్పలేనంత ఆందోళనగా ఉంది ప్రభాకరనానికి.

తండ్రికి ఏమైనా అయితే తలకుమించిన భారమే. భూషణరావు పెన్షన్ హోల్డర్. ప్రభాకరం, ప్రతిమ ఇద్దరూ ఎదిగొచ్చిన పిల్లలు. ఈమధ్యనే ప్రభాకరం ఓ కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా చేరాడు. ప్రతిమ పెళ్లీడుకొచ్చింది. రిటైరవగా వస్తున్న గ్రాట్యుటీ అన్ని ఖర్చులు పోగా, పెళ్ళికి కట్న కానుకల కోసం ఓ రెండు లక్షలు వెనుకేశాడు. చిన్న ఇంట్లో గుట్టుగా కాలక్షేపం చేస్తున్నాడు.

భూషణరావుకి నిజంగా గుండెనొప్పి అని గాని తేలితే, అది అందరినీ కలిచివేసే దారుణ సంఘటనే. దాని పర్యవసానం ఎలా ఉంటుందోనని బాధతో మెలికలు తిరగసాగాడు.

నర్సింగ్‌హోమ్ ముందుకొచ్చి ఆగింది ఆటో. అది ఈ మధ్యనే అంచెలంచెలుగా డెవలప్ అయిన హాస్పటల్, రోగులు పెరుగుతున్న కొద్దీ బిల్డింగ్ సొగసులు దిద్దుకుంటోంది. అధునాతన సౌకర్యాలతో అలరాలుతోంది. సెంట్రల్లీ ఎయిర్ కండిషన్‌తో పేషెంట్లకు ఎంతో సేద తీర్చినట్లు అమర్చి ధనాన్ని గుంజటం ప్రారంభించారు.

వచ్చేపోయే పేషంట్లతో, విజిటర్స్‌తో తిరనాళ్ళలా మహా సందడిగా ఉంది. అక్కడ అన్ని

వైపులా స్థిరంగా అమర్చిన బల్లలు, కుర్చీలలో కూర్చున్న వారంతా అసహనంతో ఏదో పోగొట్టుకున్న వారిలా దీనాతిదీనంగా, నైరాశ్యంతో కనిపిస్తున్నారు. వారిని ఓదార్చే బంధువులు, స్నేహితులు ధైర్యం చెపుతూ, సానుభూతి వాక్యాలు పలుకుతున్నారు.

ఎంట్రన్స్‌లో రిసెప్షనిస్టు, ఆ పక్కనే కంప్యూటర్ ప్రింటర్ చప్పుడు, హడావిడీ, హంగామాగా నర్సులు, బేరర్స్, ఆయాలు, లేబొరేటరీ స్టాఫ్, ఎవరి పనుల్లో వారు తలమునకలై ఉన్నారు.

ఎయిర్ కండిషన్ అద్దాల చాంబర్స్‌లో డాక్టర్స్ నేమ్‌బోర్డ్స్ వరుసగా ఎడమ, కుడివైపు అయిదేసి చొప్పున ఉన్నాయి. స్త్రీలు, పురుషులు, పిల్లలు, వెయిటింగ్ లిస్టులో, ఒద్దికగా, ఓపికగా కూర్చొని ఉన్నారు. ఈ అయోమయస్థితి నుండి, పట్టిపీడించే బాధలనుండి ఎప్పుడు విముక్తి లభిస్తుందా అని ఎదురుచూడసాగారు. ప్రభాకరం నర్సింగ్‌హోమ్‌లోకి వచ్చి రిసెప్టనిస్ట్‌తో మాట్లాడటానికి నిలుచున్నాడు.

అప్పుడే యాక్సిడెంట్ కేసు వచ్చింది. ఒళ్ళంతా రక్తసిక్తమైన వ్యక్తిని నలుగురు వ్యక్తులు మోసుకువచ్చారు. ఆ వెనకే ఏడుపులు, పెడబొబ్బలతో ఇద్దరు ఆడవాళ్ళు కూడా వచ్చారు.

నర్సింగ్‌హోమ్ తాలూకు వ్యక్తి ఒకాయన వచ్చి కోపంగా " ఎమ్ ఎల్సీ చేయాలండీ! పోలీసు కేసు నమోదు చేయాలి, అంతవరకు యాక్సిడెంట్ కేసును అడ్మిట్ చేయరు?" అన్నాడు ఖరాఖండీగా.

" అయ్యా రూల్సు మాకు తెలుసు గానీ ఫస్ట్ ఎయిడ్ అటెండ్ అవండి. ప్రాణాలు పోతే మీదే బాధ్యత" అంటూ అరిచాడు ఒకాయన.

" ఇదేమి గవర్నమెంట్ ఆస్పత్రి కాదు, నింపాదిగా మాట్లాడండి" అంటూ ఎదిరించాడు మరొకడు.

" ఇక్క డికి గొడవ పడటానికి రాలేదు. అయ్యా దయచేసి ముందు పేషెంట్ పరిస్థితిని చూడండి".

" ఆ లిఫ్ట్‌లో థియేటర్‌కి తీసుకు వెళ్లండి, పేషెంట్ తాలూకా వారిలా వచ్చి పర్టిక్యులర్స్ అన్నీ ఇచ్చి సంతకం చేసి, డిపాజిట్ అయిదు వేలు కట్టండి" అంది రిసెప్షన్‌లో బిల్లులు రాసే వ్యక్తి. ఎవరూ ఏమీ బదులివ్వకుండా లిఫ్ట్‌లో పేషెంట్‌ను పంపించేసి ఊరుకున్నారు.

అయిదు నిముషాలు గడిచాక ఒకామె చెప్పింది. " ఇక్కడ ముందు అడ్వాన్స్ ఫీజు ఫీజు చెల్లిస్తే గాని ట్రీట్‌మెంట్ కుదరదని డాక్టర్ గారు ఫోన్ చేసి చెప్పారు." అంటూ మళ్ళీ

హెచ్చరించింది.

అక్కడే ఉన్న పేషెంట్ తరపున వ్యక్తి తిరగబడేటట్లు గావుకేకలు పెట్టింది. అందరినీ పేరు పేరున శాపనార్థాలు పెడుతూ, మెడలో ఉన్న బంగారు గొలుసు, చేతి గాజులు ఊడదీసి కౌంటర్ టేబిల్ మీద ఆమె ముందు రపీమని కొట్టినట్లు పెడుతూ, " ఊ జమకట్టుకోండి, చావుబతుకుల్లో పేషెంట్ ఉన్నారని తెలిసినా జలగలా పీడించక మానరు" అంటూ విసురుగా మెట్లెక్కి ఆపరేషన్ థియేటర్ దగ్గరకి వెళ్లిపోయింది.

ఈ గందరగోళంలో అప్పటికీ భూషణరావు మగతనిద్రలోకి జారిపోయాడు.

ప్రభాకరం కోపం తారాస్థాయినందుకుంది. ' ఏమండీ, ఇక్కడ పేషెంట్ గుండెనొప్పితో కొట్టుకుంటూ సీరియస్‌గా ఉంటే అసలు పట్టించుకోరేమండి! ఇమ్మీడియట్‌గా డాక్టర్‌ను అటెండ్ అవమని చెప్పండి" అంటూ గాబరా పెట్టగానే, " సారీ సార్, ఒక్క నిమిషం ఆ లిఫ్ట్ కిందికి రాగానే థియేటర్‌కు పంపిస్తాను. ఇప్పుడే కేస్ సీరియస్‌గా ఉందని డాక్టర్ గారికి ఫోన్ చేసి చెపుతాను."అంతలో లిఫ్ట్ రానే వచ్చింది. అక్కడ ఏసిలో భూషణరావుకి చెమటలు పడుతున్నాయి. పార్వతి కొంగుతో ప్రేమగా ఒత్తుతోంది. ప్రతిమ తన హేండ్ కర్చీఫ్‌తో తుడుస్తోంది. ఏ మాత్రమైనా ఉపశమనం కలగకపోతుందా అని ఆశతో చూస్తున్నారు. ఇద్దరి హృదయాలూ ద్రవించుకుపోతున్నాయి.

ప్రభాకరం కదలడానికి సంసిద్ధుడయ్యాడు కానీ, అంతలోనే నిరాశ ఎదురైంది. లిఫ్ట్‌లో నుండి ఇద్దరు వ్యక్తులు పైకొచ్చి చక్రాల మీద నుండి పేషెంట్‌ను కిందికి దించారు. అక్కడున్న స్ట్రెచర్ మీద పడుకోబెట్టి, నఖశిఖపర్యంతం గుడ్డతో కప్పేశారు. వారి తాలూకు చుట్టాలు, బంధువులు, కుటుంబ సభ్యులు ఒక్క ఉదుటున ముందుకొచ్చి దు:ఖంతో చుట్టేశారు, అక్కడున్న అందరి హృదయాలూ కన్నీటితో ఉప్పెనలా పొంగిపోయాయి.

ఆతరువాత భూషణరావును ఇద్దరు వ్యక్తులు చక్రాల బండి మీదకు ఎత్తి కూర్చోపెట్టి లిఫ్ట్ మీదకు పైకి తీసుకెళ్ళారు. వారితో పాటు ముగ్గురు బరువెక్కిన గుండెతో వెళ్ళారు. నర్సు స్ట్రెచర్ రప్పించి, దానిమీద పడుకోబెట్టి ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లోకి తీసుకువెళ్ళింది. అప్పుడే డాక్టర్ కూడా పరుగు పరుగున వచ్చి లోనికి వెళ్ళాడు. ఐసీయూలోకి ముగ్గురినీ అనుమతించకపోవడంతో నిరాశనిస్పృహలతో వెనుదిరిగి అక్కడే ఉన్న బెంచీపై చతికిలపడ్డారు. సన్నని వణుకు, ఆవేదనలతో ముఖాలు కమిలిపోయాయి.

స్టాఫ్ నర్స్ వచ్చి " భూషణరావు తాలూకా మీరేనా? ఇలా వస్తారా" అని పిలిచింది.

ప్రభాకరం భయంగా పరుగున వెళ్లాడు. కౌంటర్‌లో ఉన్న వ్యక్తి పేషెంట్ పూర్తి వివరాలు నోట్ చేసుకుంటూ, " మీరు ఫిఫ్టీ థౌజండ్ అడ్వాన్స్ ఫీజు పే చేయాలి" అంది నిర్మోహమాటంగా చూస్తూ " ఇప్పుడే! అదేలాగండీ! ఇంటికి వెళ్ళి తేవాలి." అంటూ నసుగుతూ తల్లివైపు చూశాడు.

" క్యాష్ ఏమీ లేకుండా హాస్పటల్‌కు ఎలా వస్తారండి! ఇదేమి ధర్మాస్పత్రి కాదు కదా! టౌన్‌లో వన్ ఆఫ్ ది రెప్యూటెడ్ నర్సింగ్‌హోమ్. కార్డియాలజీ కేస్ కదా. కరోనరి ఏంజియోగ్రామ్ చేస్తారో, బైపాస్ వాల్వ్ రీప్లేస్‌మెంట్- ఏదన్నా మేజర్ కన్‌సైన్‌మెంట్. వచ్చేటప్పుడే ప్రిపేరయి రావాలి. ఇంతకీ ఎప్పుడు కడతారు? డాక్టర్ గారు అడిగితే చెప్పాలి కదండీ "కుంపటి మీద నిలుచున్నదానిలా అడిగింది.

" పేషెంట్‌ని వదిలేసి మేం ఎక్కడికి పారిపోతాం" వ్యంగ్యంగా బాధగా అన్నాడు. వెనక్కు తిరిగి వచ్చి ఎదురుచూస్తున్న తల్లితో, " ఏభై వేలు కట్టమంటున్నారు ఇప్పుడే, రేపు తెస్తానని చెప్పాను. రేపు బ్యాంకుకు వెళ్లి ప్రతిమ పేరునున్న ఫిక్సిడ్ డిపాజిట్ బ్రేక్ చేసి డ్రా చేయాలి. డాక్టర్ గారితో మాట్లాడితే ఖర్చు ఎంత అవుతుందో అన్ని వివరాలూ తెలుస్తాయి. నువ్వేం కంగారుపడకని తల్లికి ధైర్యం చెప్పాడు.

మనిషికెంత డబ్బు ఉన్నా, లేకపోయినా జబ్బులు నయం చేసుకోవడానికి డబ్బులు పెట్టాలంటే మనసు అంగీకరించదు. అయినా తప్పదు. ఎవరికన్నా బాధ అనేది ఒకే తీరులో ఉంటుంది. ప్రాణం మీద తీపి ఎక్కడికి పోతుంది.

అంతలో నలుగురు వ్యక్తులు పరుగు పరుగున మెట్లెక్కి వచ్చి, కౌంటర్‌లో కూర్చున్న వ్యక్తిపై తిరుగబడుతూ కోపంతో కేకలు వేయసాగారు. అందరి దృష్టి అటు తిరిగింది.

" ఎక్కడండీ ఆ డాక్టర్ గారు? దయాదాక్షిణ్యాలు మంచీ మానవత ఏమీ లేవా? అదే మీ కుటుంబంలో వాళ్ళకయితే ఇలాగేనా? ట్రీట్‌మెంట్ చేస్తారా? మా వాడు ఏదో చిన్న ట్రీట్‌మెంట్‌కి వస్తే దాన్ని రాచపుండులా పెద్దది చేశారు. ఉత్తి పుణ్యానికే ఐసియూలో పెట్టి పెద్ద రాద్ధాంతం చేశారు. లేనిపోని ప్రయోగాలు చేసి మూడు నెలల్లో మూడు లక్షల రూపాయలు హారతి కర్పూరంలా ఖర్చు పెట్టించారు. అయినా తట్టుకున్నాం ప్రాణాలు దక్కుతాయనుకున్నాం అదీ లేదు. డెడ్‌బాడీని మా ముఖాన కొట్టి, ఇంకా బ్యాలన్స్ ఎమౌంట్ లక్షా యాభై వేలు కట్టకపోతే డెడ్‌బాడీని కదపడానికి వీల్లేదని అడ్డుకుంటారా? ఏం మనుషులండీ, నీతి నియమం లేని నర్సింగ్‌హోమ్ నరకకూపంలా తయారైంది." అంటూ ఒకరొకరు తమ ఆగ్రహంతో ఉగ్రరూపం దాల్చి తిరగబడగానే,

అక్కడ మూగిన వారంతా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

" అవునవును, వీళ్ళు పేషెంట్స్‌తో ఆటలాడుకుంటున్నారు. ప్రాణాల్ని ఫణంగా పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. లక్షలు సంపాదిస్తున్నారు. పాపభీతి ఏ కోశానా లేదు" అంటూ చెవులు కొరుక్కున్నట్లు గొణుక్కున్నారు అక్కడున్న వారు.

ఆస్పత్రి స్టాఫ్ అంతా ఓ కంట కనిపెడుతూ నోరు మెదపకుండా నిలుచొని చోద్యం చూస్తున్నట్లు ఉండిపోయారు. ప్రతీ రోజు వారికిది మామూలు ప్రహసనమే.

నర్సింగ్ హోమ్ ఆర్.యమ్. ఓ.కి ఈ వార్త సెకెండ్స్‌లో చేరిపోయినట్లుంది. హుటాహుటీగా వచ్చి హుందాగా చిన్న ఫోజు ఇచ్చి, " ఏమిటండీ ఈ న్యూసెన్స్? ఐ డోంట్ ఎలౌవ్ ఎనీ కామెంట్స్ ప్లీజ్, ఈ హాస్పటల్‌కి ఎంతోమంది వస్తూ పెర్‌ఫెక్ట్ ట్రీట్‌మెంట్ తీసుకుని ఆరోగ్యవంతులుగా వెళుతున్నారు. అన్ని డిసీజెస్ క్లియర్ అయి పోతాయని ఎవరూ చెప్పలేరు. హెచ్.ఐ.వికి మందుందా? క్యాన్సర్‌ను పొగొట్టగలుగుతున్నామా! మీ పేషెంట్ సంగతి నాకు తెలుసు. బాగా క్రానిక్‌స్టేజ్‌లో తీసుకువచ్చారు. మందులిచ్చి బాగుచేయడానికి, కేసు ఫెయిల్ అవకుండా ప్రయత్నాలు చేయగలం కానీ, బియాండ్ ఎక్సఫెక్టేషన్స్ చేయకూడదు. చదువుకున్నారు ఈ మాత్రం ఆలోచించరా, హాస్పటల్ చార్జెస్, మెడిసిన్స్, టెస్ట్‌లకు అన్నీ కలిపి లక్షా యాభై వేలు కట్టాలి. మీరు ఎమౌంట్ పే చేయకుండా పేషెంట్‌ను ఎలా డిశ్చార్జి చేయగలం చెప్పండి? చదువుకున్న మీరే అలాగంటే ఎలా చెప్పండి " అంటూ ఆర్.ఎమ్. ఓ ఎంతో సామరస్య ధోరణిలో సౌమ్యంగా నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తూ మాట్లాడేసరికి అంతా నిశ్శబ్దంగా చూస్తూ ఉండిపోయారు. అప్పటికే ఆవేశం చంపుకోలేని ఆ పేషెంట్ కుటుంబ సభ్యుడు " మూడు లక్షలు స్పెండ్ చేశాం. బూడిదలో పోసినట్లయింది. తప్పుడు బిల్లులు వ్రాసారు. మీరంతా పేషెంట్ ప్రాణాలతో చలగాటమాడారు. ఇంకా కసితీరలేదు. లక్షా యాభై వేలు ముడుపు చెల్లిస్తే గాని డెడ్‌బాడీని కదలనివ్వనంటున్నారు. ఇప్పుటికిప్పుడు ఎక్కడ నుంచి తెస్తారన్న జ్ఞానం ఉండొద్దు" అంటూ తన మనసులో ఉన్నదంతా కక్కేశాడు.

" నిజమేనండి, అది మీ ఫ్యామిలీ ప్రాబ్లమ్, మీరే చూసుకోవాలి. ఫీజు ఎలా చెల్లించాలి అని అడిగితే ఏదో ఒక సొల్యూషన్ చెపుతాం. మీ బాధలో మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడతారు. అవి మేం పట్టించుకోలేం, ఒక్క నిముషం ఆగండి" అంటూ వడివడిగా ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళివచ్చాడు.

" మీలో పేషెంట్ తాలూకా వారు ఇద్దరు దీని మీద సంతకం చేసి, అడ్రస్ రాసి

ఇవ్వండి. ఇక మిమ్మల్ని ఎవరూ అడ్డరు, అడగరు వెళ్ళవచ్చు" అంటూ ప్రింటింగ్ చేసిన ఎల్లో పేపరులను అందించాడు.

అది చూసి నిర్ఘాంతపోయారు.

" ఏమిటిది, ప్రోంసరీ నోటా ! రోగుల పాలిట కాబూలీలా పట్టి పీడిస్తున్నారన్నమాట. ఎంత ఘోరంగా బిహేవ్ చేస్తున్నారు" అంటూ విరుచుకుపడ్డారు.

" తప్పదు మరి. బిల్లు పే చేయకపోతే అది అప్పు కిందే జమ కట్టాలికదా." ఆర్.ఎమ్.ఓ నిర్మొహమాటంగా చెప్పాడు.

' ఛీ ఛీ రిచర్డ్ బాస్టెడ్స్, అని లోలోన గొణుక్కుంటూ అయిష్టంగానే నోట్ మీద సంతకం చేసి, విట్‌నెస్ కూడా చేసి, కౌంటర్‌లో కూర్చున్నవారి ముఖాన కొట్టినట్లు విసిరి దురుసుగా వెళ్ళిపోయారు.

పేషెంట్‌తో వచ్చినప్పుడు మాత్రం ఎంతో దీనాతిదీనంగా కాళ్ళు వేళ్ళా పడి ట్రీట్‌మెంట్ కోసం బతిమలాడుతారు. పేషెంట్ బతికిబట్టకడితే బ్రహ్మరథం పడతారు. లేకపోతే చీదరించుకుని దుర్భాషలాడతారు. వీళ్ళ తీరే అంత" అనుకుంటూ స్టాఫ్ అంతా ఎవరి పనుల్లోకి వారు వెళ్ళిపోయారు.

ఇక్కడ జరుగుతున్న వ్యవహారమంతా చూస్తున్న కొద్దీ ప్రభాకరం, పార్వతి, ప్రతిమల ఒంట్లో రక్తం సలసల కాగినట్లు అట్టుడికిపోయారు. ఈ ప్రపంచంలో ఉన్న అవినీతి అంతా ఇక్కడే పోత పోసినట్లు అనిపించింది.

ప్రతీ నర్సింగ్ హోమ్‌కి పేషెంట్స్‌ని మార్చుతూ రవాణా చేసే కార్యక్రమంలో ఎంత ఎక్కువ కమీషన్ పొందవచ్చో బ్రోకర్స్, మీడియేటర్స్ ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ దోచుకోవడంలో ఎక్కువగా సహకరించే వారు కూడా డాక్టర్సే కావడం ఎంతో శోచనీయం.

మమత, మానవత్వం, దయ ఉండవలసిన చోటులో నిర్దయ, దురహంకారం, దానవత్వం ఇంకా ఎన్నో దుర్గుణాలు చోటుచేసుకుంటున్నాయి.

ముగ్గురు ఒకరిముఖాలొకరు వైరాగ్యం పొందిన వారిలా విరక్తిగా చూసుకున్నారు. ఒక గంట గడిచాక డాక్టర్ తన ఛాంబర్‌కు రమ్మని కబురు చేశాడు. ముగ్గురూ వెళ్ళారు. అక్కడ ఎంతోమంది పేషెంట్స్ డాక్టర్ కన్సల్టేషన్, ప్రిస్క్రిప్షన్ కోసం కాచుకుని ఉన్నారు. వారందరినీ దాటుకుని వెళ్లడానికి కంపౌండర్ ద్వారపాలకుడిలా వెంటనే

అనుమతించలేదు. అక్కడ కొంతసేపు నిరీక్షించవలసి వచ్చింది. నర్సింగ్ హోమ్ స్టాఫ్‌లో ఒకరు అక్కడున్న పేషెంట్స్ అందరినీ స్క్రీనింగ్ టెస్ట్ చేస్తున్నాడు. వారిలో రిచ్ ఎవరు? పూర్ ఎంతమంది? ఎసెస్‌మెంట్‌లో కోరినంత ఫీజు చెల్లించగలిగిన వారికి పెద్దపీట వేయడం, లేని వారికి మరో చోటకు పొమ్మనడం కనిపించింది.

ప్రభాకరం, పార్వతి తమ ఆర్థిక స్థితిగతులు ఎంతమేరకు నిలబడతాయోనని బేరీజు వేసుకోసాగారు.

డాక్టర్ దగ్గర నుండి పిలుపువచ్చింది. లోనికి రాగానే డాక్టర్ ఎంతో సౌమ్యంగా ఉదార స్వభావంతో ఉన్నవాడిలా పలకరిస్తూ కూర్చోమని సైగచేశాడు. పార్వతి మాత్రమే కూర్చుంది. ప్రభాకరం, ప్రతిమ మర్యాదపూర్వకంగా నిలుచున్నారు.

" చూడండి మీరేమి భయపడకండి, ఐసియూలో అడ్మిట్ చేశాం. అన్‌కాన్షస్‌లో వున్నారు. తెలివి రాగానే స్కానింగ్, ఇతర టెస్ట్‌లు చేయాలి. ఇప్పుడు మీరు ఫీజు ఏమైనా కట్టారా" అంటూ బజర్ ప్రెస్ చేసి నర్సును పిలిచాడు. ఏదో ముఖ్యమైన పని ఉన్నట్లు.

కానీ అంతలోనే, " లేదుసార్, ఏభై వేలు కట్టమన్నారు. రేపు కట్టేస్తాను" అంటూ మెల్లగా చెప్పాడు ప్రభాకరం చేతులు కట్టుకుంటూ.

నర్సులోనికి రాగానే డాక్టర్ అడిగాడు, " సిస్టర్, మన హాస్పటల్‌లో ప్యాకేజ్ ట్రీట్‌మెంట్ సిస్టమ్ గురించి ఏమైనా చెప్పారా? వాళ్ళకి ఏది బాగుంటుందో అది చెపితేనే కదా తెలుస్తుంది! సరే వెళ్ళండి, నేనే చెపుతాను" అంటూ రోలింగ్‌చైర్‌లో నాటకీయంగా అటూ ఇటూ ఊగుతూ చెప్పసాగాడు.

" మా హాస్పటల్‌లో ట్రీట్‌మెంట్ రోజుల తరబడి జరుగుతుంటే వేలు, లక్షలు ఖర్చు అయిపోతూనే ఉంటుంది. భరించలేరు. మీకు ఒక అంచనా లేకుండా, ఎవరికి ఎంత అవుతుందో కూడా తెలియని పరిస్థితుల్లో బాధపడుతుంటారు. అదంతా లేకుండా ఫలానా ట్రీట్‌మెంట్‌కి ఫిక్స్‌డ్ అమౌంట్ అంటూ ఉంటుంది. అన్ని ఖర్చులు అందులోనే కలసి ఉంటాయి. పేషెంట్‌ను మళ్ళీ మామూలు మనిషిలా చేసి ఇంటికి పంపేవరకూ అదే ప్యాకేజీ ఉంటుంది. అదే మీరు తీసుకోండి, బాగుంటుంది" అంటూ ఉచిత సలహా ఇచ్చాడు డాక్టర్.

డాక్టర్ మాటలకు కరిగిపోయినట్లు " సార్ మీరేది చెపితే అదే చేస్తాం, మా డాడీని మళ్ళీ మామూలు మనిషిని చేసే పుణ్యం మీది" అంటూ ఎంతో నమ్రతగా పలికాడు ప్రభాకరం.

"కార్డియాక్ ప్రొబ్లమ్. హార్ట్ ఫంక్షన్ సరిచేయాలి. ఆపరేషన్ చేయవలసి ఉంటుంది. ప్రమాదమేమీలేదు. భయపడనవసరంలేదు. మూడు లక్షల వరకూ అవుతుంది. ఫరవాలేదు కదా, చూసుకోండి" అని సూచనప్రాయంగా చెపుతూ ఆగాడు.

పార్వతి గుండెల్లో నుండి వస్తున్న దు:ఖాన్ని బలవంతంగా దిగమింగుకుంటూ, " సార్, ఆయన ప్రాణాలకన్నా మాకేదీ ముఖ్యం కాదు. అలాగే కానివ్వండి" అంది బాధగా.

వెంటనే డాక్టర్ స్పందిస్తూ " మరో విషయం కూడా మీరు తెలుసుకుంటే మంచిది. పేషెంట్ లైఫ్ స్పాన్ పెంచే పరికరం ఒకటుంది. పేస్‌మేకర్ అది. అవసరమైతే వాడతాను, లేకపోతే లేదు. దానికి లక్షా అరవైవేలు అవుతుంది. ముందుగా ఎందుకు చెపుతున్నానంటే, క్యాష్ రెడీ చేసుకుంటారని. అయినా, అంత అవసరం లేకపోవచ్చు అంతా మీ అదృష్టంపైన ఆధారపడి ఉంది" అంటూ ఎంతో ఔదార్యం తన మాటల్లో చూపుతూ ఆకట్టుకున్నారు.

" ప్యాకేజీ సిస్టమ్ ఏదో ఉందన్నారు.."

" ఓ అదా! అదయితే ఎనభైవేలకే, పదిరోజుల్లో పూర్తయిపోతుంది. పేస్‌మేకర్‌తో అయితే లక్షా నలభైతోనే చేయొచ్చు. ప్యాకేజీ ప్రొగ్రాం తీసుకుంటేనే పూర్తి మొత్తం చెల్లించాకే చెప్పండి" అంటూ ప్రాణాల్ని నిలబెట్టడానికి చక్కని వ్యాపార అనుభవాన్ని ముడివేస్తూ చెప్పాడు.

ఇంత చక్కని డాక్టర్‌ను మేం చెప్పుడూ చూడలేదు. పేషెంట్ ప్రాణాలను కళ్ళు మూసుకొని డాక్టర్ చేతిలో పెట్టవచ్చని ఆలోచనలో పడి గుండె నిబ్బరం చేసుకున్నారు ముగ్గురూనూ.

చెప్పిన విషయాలన్నీ ఒప్పుకున్నట్లు చెప్పి, ఒకటి రెండుసార్లు దండాలు పెట్టి మరీ వెళ్ళారు.

ఆ మరుసటి రోజు బ్యాంకు నుండి డబ్బు డ్రా చేసి, పది రోజుల ట్రీట్‌మెంట్ ప్యాకేజీ ప్రొగ్రామ్‌కి నర్సింగ్ హోమ్‌లో చెల్లించారు.

వెంటవెంటనే ఆపరేషన్ ఏర్పాట్లు జరిగాయి.

ఆపరేషన్ అనంతరం డాక్టర్ వచ్చి చెప్పాడు. అంతా సక్సెస్‌ఫుల్‌గా జరిగింది. మీకు ముందే చెప్పడం మంచిదయింది. స్పాన్ ఆఫ్ లైఫ్ పెరగడానికి పేస్‌మేకర్ కూడా అమర్చాం. క్యాష్ గురించి ఏమీ ప్రొబ్లం లేదన్నారుగా, అయినా ఇంకా హేపీగా తిరగొచ్చు. అని ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు. వేయి దేవుళ్ళకు దండాలు పెట్టుకున్నారు ఈ ముగ్గురూను. వారం రోజులు గడిచాయి. డిశ్చార్జి ఫామ్స్ తయారయ్యాయి. ఆ రోజు

పేషెంట్ భూషణరావుని డిశ్చార్జి చేయాలని అనుకున్నారు.

డాక్టర్ స్టాఫ్ నర్సుని పిలిచి ఎనభై వేలకు మరో బిల్లు తయారు చేసి భూషణరావు పేషెంట్‌కు చెందిన వారికిమ్మాన్నాడు.

అథార్టీగా, ఆమె ప్రిపేర్ చేసిన బిల్లు మీద డాక్టర్ సంతకం కావాలని ఛాంబర్‌కు వస్తూనే తన అనుమానాన్ని వ్యక్తం చేసింది. "సార్, మీరు రాంగ్ బిల్లు వేసినట్లున్నారు. భూషణరావు పేషెంట్‌కి మనం పేస్‌మేకర్ ప్రిపేర్ చేయలేదు కదండీ. ఎలా చార్జి చేస్తాం" అంది కాస్తంత గట్టి స్వరంతోనే.

ఆ వెనకే కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చిన పార్వతి, ప్రతిమ, ప్రభాకరం ఈ మాట విని గుండాగినట్లు శిలాప్రతిమలై ఉండిపోయారు.

డాక్టర్ ఆ క్షణాన తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి తన ఫేస్‌ను ఎలా మేకప్ చేసుకోవాలో అర్థం కాక తన వంచుకొని నానా అవస్థ పడసాగారు.

ఏ.సి రూమ్ అద్దాల డోర్ ధబేల్‌మని శబ్దం వినగానే డాక్టర్ తలెత్తి చూశాడు.

అక్కడ ఆ ముగ్గురూ కనబడలేదు.

(ఇండియా టుడే) (13-3-2001)